


# వెళ్ళొస్తాను, భానూ!

నాలుగు సంవత్సరాల క్రితం భానుమతికీ, శ్రీనివాసరావుకీ పెళ్ళయింది. ఇద్దరు పిల్లలు వాళ్ళ కిప్పుడు. పెద్ద వాడికి మూడేళ్ళు, చిన్నవాడికి దాదాపు సంవత్సరం వయసు. దైన్ను దయ తలిస్తే మరి పిల్లలు పుట్టరు.

వివాహంతో మనిషి జీవితానికి సంపూర్ణత సిద్ధిస్తుంది కాని, జీవితంలో సుఖానికి, సమాజపు స్వరూపానికి సంబంధం ఉంది.

రాత్రి నిద్ర పోబోయేముందు భానుమతి శ్రీనివాసరావుకి గుర్తు చేసింది — "రేపటికి నాలుగు సంవత్సరాలయింది మన పెళ్ళయి" అని.

శ్రీనివాసరావుకి ఒక్క క్షణంలో హోమ గుండంలోంచి నెయ్యీ, చెక్కలూ కాలుతున్న వాసనా, వంకీలుగా పైకి లేస్తున్న పొగా, తల వంచుకుని కూర్చున్న భానుమతి, పచ్చి కొబ్బరికాయమీద ఆన్చిన పచ్చటి సున్నితమయిన చెయ్యీ, మెరిసిన సిలవు, ఎరుపు ఉంగరాలూ, పసుపుతో అక్షతలు కలుపుతున్న పురోహితుడూ, పచ్చకర్పూరపు దండల వాసనా, పందిరినీడా, పచ్చటి తోరణాలూ, ఎక్కడినుంచో అతిథుల మధ్య నుంచి పక్కుమని ఒక అమ్మాయి నవ్వూ, పెళ్ళిపీటమీద కూర్చోగా కూర్చోగా తిమ్మిరెక్కిన కుడి కాలూ జ్ఞాపకం వచ్చి మాయమయ్యాయి.

"రేపు ఆదివారంకూడా కలిసొచ్చింది. ఏం చేద్దాం, భానూ?" శ్రీనివాసరావు అడిగాడు.

భానుమతి కళ్ళు తెరిచి నవ్వింది. "ఏం చేస్తాం? ఊరికినే జ్ఞాపకం చేసుకోవడం. కొన్ని జ్ఞాపకాలు సంతోష పెడతాయి. తియ్యగా ఉంటాయి. కాని, అలాగ ఆనందిస్తున్నప్పుడూ ఈ పేటటి జీవితం సలుపుతూనే ఉంటుంది. ఊరికనే." క్షణాల మీద ఆమె మనసు భారమయింది.

భానుమతి మనసు భారమవడం శ్రీనివాసరావుకి అర్థం అయింది. గుండెకూ, గొంతుకూ ఉన్న సంబంధం అలాంటిది.

"చెయ్యడం అంటే పెద్ద సంబరాలు జరపలేం కాని, రేపొక్క రోజు సరదాగా, సుఖంగా గడపలేమూ? అది చేతకాదా మనకి?" అడిగా డతను.

భానుమతి బెడ్‌రూమ్ దీపం తీసి చూస్తూనే పక్కన పడుకున్న చంటివాడి నుదురు నిమిరింది. వాడు కదిలాడు. "ఏదైనా చెయ్యలేకపోవడం చేతగాక కాదండీ. . . పోగలేక."

"నాన్సెన్స్! భానూ, సుఖంగా బతకడం అంటే ఏమిటో తెలుసా? భయంలేని బతుకే సుఖం. రేపు. . . రేపు మనం దేనికీ, ఎవ్వరికీ భయపడకుండా సరదాగా గడుపుదాం. ఏం?" ఆవేశంగా అడిగాడు శ్రీనివాసరావు.

పడుకునే ముందు శ్రీనివాసరావు ఆవేశం సంతానం కోసం తప్ప మరెందుకూ పనికొచ్చినట్టు భానుమతికి జ్ఞాపకం లేదు. అతనప్పుడు చేసిన బాసలుకూడా ఆమె నమ్మడం మానేసింది.

మరునాడు ఉదయం శ్రీనివాసరావు నిద్ర లేచేసరికి భానుమతి తలంటి పోసుకుని తువ్వాలుతో జుత్తు ముడేసుకుని ఉంది. గబగబా స్నానం చేసి తువ్వాలు ఒంటికి చుట్టుకుని, భానుమతి చెయ్యి పట్టుకుని కొట్టుగదిలోకి వెళ్ళాడు. కొట్టు

మంచం మీద కూర్చుంది. "ఏమిటా, పాపం?"

"మతి పోయి ఉంది. సినిమా వాడు ఎల్లాంటి సీన్లు చూపించాడు?" శ్రీనివాసరావు భానుమతి భుజం మీద చెయ్యి వేశాడు.

"సిగ్గు లేదూ మీకు? పడుకొని నిద్ర పోవడం మానేసి!" భానుమతి భర్తని మందలించి అటు వేపు తిరిగి పడుకుంది.

శ్రీనివాసరావు మారు మాటాడకుండా దిండుమీద వాలాడు. కొన్ని నిమిషాలు మౌనంగా ఉన్నాడు. "భానూ!" నెమ్మదిగా పిలిచాడు.

"ఊఁ." భానుమతి ఒత్తిగిలి అతని వేపు తిరిగింది. బెడ్‌రూమ్ దీపం వెలుగులో ఆమె మోహనంగా ఉంది. కనురెప్పల మీది సోగవెంట్రుకల నీడలు ముక్కు మీద పడుతున్నాయి. రెప్ప వాల్చకుండా తన వేపే చూస్తున్న శ్రీనివాసరావుని చూసి ఆమె చిరునవ్వు నవ్వింది.

చలించిపోయాడు శ్రీనివాసరావు. భానుమతిని దగ్గిరగా తీసుకుని చెంపకు చెంప చేర్చి కళ్ళు మూసుకుని, "భానూ! భానూ!" అని గొణిగాడు.

భానుమతి అతని నుదుటి మీద జుత్తు ఎగ్రదోసి ముద్దు పెట్టుకుంది. "నిద్ర పోండి. గుడ్ నైట్!" అంది తియ్యగా.

కొన్ని క్షణాలు శ్రీనివాసరావు మాటాడలేదు. తరవాత మళ్ళీ హఠాత్తుగా పిలిచాడు: "భానూ!"

"ఊఁ" కొట్టింది భానుమతి.


"ఆర్ ఉయ్ నాట్ హేపీ ఇనవర్ ఓన్ వే?"

భానుమతి కళ్ళలోంచి ఎంతో వెలుతురూ, ప్రేమా ప్రవహించాయి. ఆమె అరచేత్తో మొహం కప్పుకున్నాడు శ్రీనివాసరావు.

భర్త నిద్రపోయిన చాలా సేపటికి కాని భానుమతికి నిద్ర పట్టలేదు. మర్నాడు ఉదయం భానుమతి వేగిరంగా లేచింది. పిల్లలకి తలా, ఒళ్ళూ అయిన తరవాత భర్త కోసం చూసింది. మొహం, స్నానం అయిన శ్రీనివాసరావు ఏదో ఆలోచిస్తూ మంచం మీదే కూర్చుని ఉన్నాడు.

కాఫీ కలిపి తీసుకొచ్చింది భానుమతి.

మౌనంగా కాఫీగ్లాసు తీసుకున్నాడు శ్రీనివాసరావు. అప్పుడతని చేతి వేపు చూసింది భానుమతి. చటుక్కున అడిగింది: "మీ ఉంగరం ఏమయిందండీ? నీళ్ళ గోలెం దగ్గర కాని వదిలేలేదు కదా?"



ధవళేశ్వరం ఆనకట్ట — ఫొటో—కె. ఎ. పి. స్వామి (విశాఖపట్నం)

దెబ్బ తిన్నట్టు చూశాడు శ్రీనివాసరావు.

"ఏం, అలా చూస్తున్నారూ? కొంప దీసి పోలేదు కద?" భానుమతి ఆత్రతగా అడిగింది.

శ్రీనివాసరావు ఒక్క గుక్క కాఫీ తాగాడు. వేడికాఫీ గొంతు కాల్చింది. లేదన్నట్టు తల ఊపాడు. మరేమయింది?

"మాటాడరేమండీ?"

మాట్లాడలేదు శ్రీనివాసరావు. భానుమతి గుండెలు గబగబా కొట్టుకున్నాయి. "చెప్పరా?" అనడిగింది.

"ఏమిటి చెప్పడం, భానూ? కాలం కలిసొస్తే మరోటి చేయించుకుందాంలే" అన్నాడు శ్రీనివాసరావు, చేదుగా నవ్వి.

భానుమతికి నిన్న శ్రీనివాసరావు ఖర్చులన్నీ గుర్తొచ్చాయి. అంతకుముందు రాత్రి అతని మాటలూ గుర్తుకొచ్చాయి. పగలంతా పకపకా నవ్వుతూ తిరిగిన వెలుతురంతా, రాత్రయేసరికి ఏమయిపోయిందో తెలిసిన పక్షిపిల్ల లాగా అయిపోయిందావిడ.

"నిన్న ఉదయం టౌన్లో కెళ్ళింది అందుకా? అందుకా?" భానుమతి భయపడుతూనే అడిగింది.

అందుకే అన్నట్టు తల ఊపాడు శ్రీనివాసరావు.

నిన్నటి సంతోషపు పొలన్నీ నేటి ఉదయపు నిజం వల్ల విరిగిపోయాయి.

శ్రీనివాసరావు చూపులన్నీ కాఫీగ్లాసు మీదే ఉంచి కాఫీ తాగాడు. గ్లాసు దగ్గిరవటం వల్ల కళ్ళు నొచ్చాయి. నెమ్మదిగా భానుమతి కేసి చూశాడు.

ఆమె కళ్ళు చెమ్మగా ఉన్నాయి. ఆ చెమ్మలో బెంగల విత్తనాలు మొలకలెత్తి ఎన్ని చీకటి పూలు పూస్తాయో!

తల వంచుకున్నాడు శ్రీనివాసరావు. నడుం వంచి మంచం మీద కూర్చున్నాడు. క్రమంగా అతని చెవులు ఎరుపెక్కాయి. ఒక్క క్షణం కళ్ళు మూసుకుని మళ్ళీ తెరిచాడు. "భానూ! నిన్న ఉంగరం అమ్మడానికి ఒక బంగారం కొట్టుకి వెళ్ళాను. అక్కడొక పల్లెటూరి ఆవిడ కన్నీరు పెట్టుకుంది — ముక్కుబుడక అమ్మేసి. అప్పుడా కన్నీటికి సెంటిమెంటు కారణం అనుకున్నాను. ఆ క్షణాన ఉంగరం అమ్ముతూ నేను కనీసం నిట్టూర్పు దలుచుకోలేదు. కానీ, ఈ ఉదయం...కారణం ఏమీ లేదు గాని... గాలీ వానా వెలిసిన తరవాత కూలిన నగరం చూసి కన్నీరుకట్టలు తెంచుకున్నట్టుంది. నిన్నంతా నన్ను నేను మోసం చేసుకున్నాను, భానూ!"

భానుమతి పెదాలు వణికాయి.

"భానూ! నిన్న భయంలేని బ్రతుకునే సుఖం అన్నాను—గుర్తుందా? కానీ, భయపడకుండా ఎలాగ ఉండగలం, భానూ? ఒక్క పూట భోజనానికీ ఒక్క చిరునవ్వుకీకూడా నెత్తురే అమ్ముకోవలసి వచ్చినప్పుడు భయపడకుండా ఎలాగ ఉండగలం, భానూ? ఇలాగ ... ఈ బ్రతుకిలాగ ఉన్నప్పుడు భయపడవద్దని చెప్పడం, కన్నీరు పెట్టుకోకండెవ్వరూ అని చెప్పడం మోసం. పచ్చి మోసం, భానూ! భానూ! లోకంలో ఎక్కువ మంది బాధల్ని పళ్ళ బిగువున అదిమిపట్టి మౌనంగా బతుకుతున్నారు. పైకి చెప్పుకోవడంలేదు. రేపు ఏమవుతుందిరా, దేవుడా? అని బెంగతో అనుమానమూ ఉలిక్కిపడటం ఎలాంటి బతుకు, భానూ?" శ్రీనివాసరావు నుదుటి మీది నరాలు పొంగాయి.

"సుఖం లేదు, భానూ! హఠాత్తుగా మరీ పెద్ద దెబ్బ తగిలిన వాడికి తిమ్మిరెక్కిపోతుంది. నెత్తురు కారిపోయినా, కోసుకుపోయినా నెప్పి తెలియదు. మన ఇరుకు బతుకు అలాగే మొద్దుబారిపోయాయి కామోసు, భానూ! వాతావరణం బరువుకి అలవాటు పడిపోయిన మనకి ఒక బియ్యపు బస్తాడు బరువు మోస్తున్నామని తెలియదు. అలవాటు పడిపోయాం. అందుచేత పోల్చుకోలేకపోతున్నాం. మన బతుకులూ అంతే, భానూ! దుర్మార్గానికి అలవాటుపడిపోయినట్టుంది మనం. కారణం కోసం చూస్తే ఎవడూ కనిపించడు. కారణం ఏమిటో తెలుసా, భానూ? చట్రం. ఈ చట్రంలోనే ఉంది దుర్మార్గం, దుర్మార్గం." కళ్ళు మూసుకున్నాడు శ్రీనివాసరావు.

అతని కనురెప్పల వెనక సూర్యోదయమో, అస్తమయమో భానుమతికి తెలియలేదు. వెర్రిగా చూస్తూ నిలబడింది.

కొద్ది నిమిషాల తరవాత శ్రీనివాసరావు కళ్ళు తెరిచాడు. ఎర్రబారి పోయాయి కళ్ళు. తెల్లగుడ్డు నిండా గజిబిజిగా నెత్తుటి దారులు. భానుమతి వంక చూడకుండా నడిచి గోలెం దగ్గిరికి వెళ్ళి మొహం తడుపుకున్నాడు. తువ్వాలుతో వత్తుకుని గొంతు సవరించుకుంటూ బట్టలు వేసుకున్నాడు. ఆఫీసు కాగితాలు తీసి తరవాత జేబులు తడుముకున్నాడు. చిల్లర. . . పావలా మిగిలింది. నాలికతో పెదాలు తడుపుకున్నాడు.

"భానూ! నీ దగ్గిరేమయినా డబ్బులున్నాయా?" నెమ్మదిగా అడిగాడు.

భానుమతి భర్త వంక చూసింది. "ఏమిటండీ అలాగ అయిపోయారూ? . . . వెధవ ఉంగరం పోతే పోయింది" అంది.

శ్రీనివాసరావు నవ్వడానికి ప్రయత్నం చేశాడు.

"లేవా?" అడిగాడు.

"ఉన్నాయున్నాయి. నిన్న ఇరవై ఇచ్చేరు కదా? రెండు రూపాయిలు మిగిలేయి. ఉండండుండండి. తెస్తాను. . ."

గబగబా లోనికి వెళ్ళి తెచ్చి ఇచ్చింది.

శ్రీనివాసరావు డబ్బులు జేబులో పెట్టుకున్నాడు. "వెళ్ళొస్తాను, భానూ!"

మధ్యాహ్నం బియ్యం కొంటేగాని పిల్లేదని భర్తకి చెప్పలేకపోయింది భానుమతి. ★